క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో 15 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా బుధవారం రాజీనామా చేశారు. వెలుగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేశారు.

టీడీపీకి ఓటు.. సంక్షేమానికి చేటు



కడుమూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి

మిడుతూరు: ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే ఇప్పటి వరకు పేదలకు అందుతున్న సంక్షేమానికి చెల్లుచీటి రాసినట్లేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కడుమూరు గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆదిరెడ్డి జగదీశ్వర రెడ్డి, నాయకులు మల్లు శివ నాగిరెడ్డి, హిదాయతుల్లా, శంకర్ రెడ్డి, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

తర్తూరు తాత్కాలిక హుండీల ఆదాయం లెక్కింపు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేసిన మూడు తాత్కాలిక హుండీలను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ ఏడీ వెంకటరమణ సమక్షంలో బుధవారం లెక్కించారు. దేవదాయశాఖ సిబ్బంది, భక్తులందరూ కలిసి హుండీల్లోని డబ్బులను లెక్కించగా రూ.4,42,901 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే పదిరోజుల టికెట్ల అమ్మకం ద్వారా 3,45,000 నగదు సమకూరినట్లు తెలిపారు. గత ఏడాది కంటే రూ.35వేల ఆదాయం తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది నారాయణ, బాలుడు, తదితరులు పాల్గొన్నారు.

శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న శిల్పా మాన్వితారెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోడలు శిల్పా మాన్వితారెడ్డి కోరారు. పట్టణంలోని గరీబ్‌నగర్‌లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు సయ్యద్‌మీర్, కౌన్సిలర్లు విజయ్‌చౌదరి, ముర్తుజా, పార్వతి, రాజగోపాల్, జయకృష్ణ, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, జాకీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో ఇంటింటి ప్రచారం



వెలుగోడులో ప్రచారం చేస్తున్న శిల్పా భాగ్యలక్ష్మి

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సతీమణి భాగ్యలక్ష్మి వెలుగోడు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గుండ్రెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, షంషీర్ అలీ, నసిరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే నాయీబ్రాహ్మణులకు గుర్తింపు



బండిఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ సేవాసమితి సభ్యులు

మహానంది: రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులకు గత టీడీపీ పాలనలో గుర్తింపు లేదని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హేళనగా మాట్లాడిన రోజులు మర్చిపోలేమని ఆత్మకూరు నాయీబ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు పగిడాల శివపాములేటి తెలిపారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల్లో శిల్పా చక్రపాణిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నాయీబ్రాహ్మణులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. సేవా సమితి ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, ట్రెజరర్ అనిల్, సహాయ కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదలకు విద్య, వైద్యం

- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనన్నే రావాలి
- కూటమి అభ్యర్థులకు ఓటువేస్తే మళ్లీ పేదరికంలోకే..
- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



ముసలిమడుగులో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చిత్రంలో అభ్యర్థి దారా సుధీర్

కొత్తపల్లి: రాష్ట్రంలో విద్య,వైద్యాన్ని పేదప్రజల చెంతకు చేర్చింది, నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేవలం జగనన్నకే దక్కుతుందని శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. బుధవారం మండలంలో మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు చంద్రమౌళితో కలసి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రాచీన సంగమేశ్వరాలయంలో వేపదారు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అక్కడి నుంచి కపిలేశ్వరం, పాతమాడుగుల, ఎర్రమఠం, ముసలిమడుగు, చిన్న గుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం, సింగరాజుపల్లె, బట్టువారిపల్లె, శివపురం, లింగాపురం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఫ్యాను గుర్తుకు ఓటేయాలి

ఈనెల 13న జరగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నంద్యాల పార్లమెంట్ ఎంపీగా పోచా బ్రహ్మానంద రెడ్డిని, నందికొట్కూరు ఎమ్మెల్యేగా దారా సుధీర్‌లను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి కుంటుపడకుండా పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి ప్రజలందరూ సంతోషంగా ఉండాలంటే జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలని అందుకు ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎర్రమఠం టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు తన అనచరులతో సహా ఆపార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఎర్రమఠం టీడీపీ నాయకుడు సుబ్బరాయుడి

గెలిపించండి మరింత అభివృద్ధి చేస్తాం

ఎంపీగా పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యేగా దారా సుధీర్‌లను ప్రజలు గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని సిద్ధార్థరెడ్డి అన్నారు. మండలంలోని పాతమాడుగులను ప్రత్యేక పంచాయతీగా గుర్తించేలా కృషి చేస్తామని, ఎర్రమఠం, ముసలిమడుగు, సింగరాజుపల్లె, శివపురం గ్రామాలకు తాగు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. మళ్లీ ప్రభుత్వం ఏర్పడి నాటినుంచే గ్రామాలలో అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటికి తాగునీరు తప్పకుండా అందిస్తామన్నారు. జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, సచివాలయాల కన్వీనర్ పి.నాగలక్ష్మి రెడ్డి, ఎంపీటీసీలు బాలరాజు, శివన్న, అలీబాషా, సర్పంచులు బాల ఎల్లయ్య, నక్క విజయ్ కుమార్, కె.మారెన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, మహబూబ్ బాషా, వెంకటరమణ, ఆర్‌ఎంపీ వెంకటేశ్వర్లు, బాబురెడ్డి, కృష్ణుడు, నాగార్జున రెడ్డి, అచ్చిరెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో



మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలువడించిన మేనిఫెస్టో ప్రజల సంక్షేమం కోసమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో విస్తృత పర్యటన చేశారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. విశ్రాంతి ఎరుగక కృషి చేయాలని, మేనిఫెస్టోను, ప్రజలకు ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు.

టీడీపీవి అమలుకు సాధ్యంకాని హామీలు

టీడీపీ వెల్లడించిన మేనిఫెస్టోను ప్రధాని మోదీ అంగీకరించలేదని, కర పత్రంలో తన ఫోటో ముద్రించవద్దని చెప్పారని ఎంపీ పోచా అన్నారు. తుమ్మలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధ్యం కాని హామీలతో కేవలం అధికారం దాహంతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు చేసే కుట్ర అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ప్రజలను నమ్మించేదిగా ఉందని, బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకొని తయారు చేసినదని తెలిపారు. 2014–19 ఐదేళ్ల పాలనలో చంద్రబాబు నాయుడు ఎందుకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకునేందుకు కూటమిగా ఏర్పడ్డారని ఎద్దేవా చేశారు. రెండు ఓట్లు వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు ప్రజలు సుముఖంగా ఉన్నారన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు విజయసింహారెడ్డి, సర్పంచులు వరప్రసాద్, నాయిని సావిత్రమ్మ, రామస్వామి, కోట్ల చంద్రారెడ్డి,చింతల నారాయణ, శ్రీలత, ఎంపీటీసీలు వరలక్ష్మి, బషీరాహ్మద్, సురేష్, సరస్వతమ్మ, దర్గాబాయి, కో ఆప్షన్ ముర్తుజావలి, సొసైటీ చైర్మన్లు చౌడయ్య, గడ్డం కృష్ణారెడ్డి, నాయకులు కోట్ల నాగేశ్వరరెడ్డి, నాగరాజు, మధుసూదన్‌రావు, రామక్రిష్ణారెడ్డి, బాలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మైనారిటీలంతా శిల్పాకు ఆత్మీయులు



మాట్లాడుతున్న శిల్పా కార్తీక్‌రెడ్డి, చిత్రంలో బుడ్డా శేషారెడ్డి

వెలుగోడు: ముస్లిం మైనారిటీలంతా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆత్మీయులే అని ఆయన తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శిల్పా కార్తీక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అహ్మద్‌హుసేన్, నియోజకవర్గ అబ్జర్వర్ హబీబుల్లా తదితరులు హాజరయ్యారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి ముస్లిం, హిందు, క్రైస్తవులను సమానంగా చూస్తు నియోజకవర్గంలో మసీదులు, చర్చిలు, దేవాలయాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని, మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ అంటే..ముస్లింలు.. ముస్లింలు అంటే జగన్

జగన్ అంటే ముస్లిం..ముస్లిం అంటే జగన్ అని బుడ్డా శేషారెడ్డి అన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు తీసుకురావడంతో ఎంతో మంది ముస్లింలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని గుర్తు చేశారు. టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకుందని, మోదీ 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నా చంద్రబాబు నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు రెండు పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారని, అందులో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చారని, మళ్లీ మోసం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో మైనారిటీ జిల్లా అధ్యక్షుడు యూనిస్, మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎంపీపీ లాలం రమేష్, వాణిజ్య విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నసిరుల్లాఖాన్, షంషీర్ అలీ, జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.

అమలు చేయలేని హామీలతో మరోసారి మోసం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సున్నిపెంటలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

శ్రీశైలంటెంపుల్: అమలు చేయలేని హామీలను మరోసారి తన మేనిఫెస్టోలో పెట్టి ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ తెలిపారు. బుధవారం శ్రీశైలంలోని కొత్తపేట, శ్రీగిరి కాలనీ, హైస్కూల్ గ్రౌండ్, ఎస్టీ కాలనీ తదితర ఏరియాలలో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత 5ఏళ్లలో ప్రజలకు సీఎం జగన్ చేసిన మేలులను వివరించారు. ప్రచారంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వియ్యంకులు రాజేంద్రరెడ్డి దంపతులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు టీఎండి.రఫి, అనిల్‌కుమార్‌రెడ్డి, సవమ్మ, ప్రభావతి, విష్ణు, కొటమ్మ, కుమార్, శరత్, రత్నకుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సున్నిపెంటలో ముమ్మరంగా ప్రచారం

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన శ్రీశైలం ప్రాజెక్టులో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసి వర్గాలకు చెందిన యువకులు వైఎస్సార్‌సీపీ జెండాలను ఎత్తుకొని వీధి వీధిలో ప్రచారం సాగిస్తున్నారు. జగనన్న ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, నియోజకవర్గంలో శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవలను వివరిస్తూ తమ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



లక్ష్మాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి

పగిడ్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిందని, మళ్లీ జగనన్న పాలనను తెచ్చుకుందామని డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మాపురంలో చేపట్టిన ఇంటింటి ప్రచారానికి ఓటర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ నూర్జహాన్ బేగం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉస్మాన్‌బాషా, పీఎంసీ చైర్మన్ మొల్ల మహబూబ్‌బాషా, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శిరిగిరెడ్డి చంద్రారెడ్డి, నాగశేనారెడ్డి, భూషిరెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటు వేస్తే హక్కులను కాలరాసుకున్నట్లే



మాట్లాడుతున్న అబుబక్కర్

పాములపాడు: రాష్ట్రంలోని ముస్లింలు కూటమికి ఓటు వేస్తే మన హక్కులను మనము కాలరాసుకున్నట్లేనని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇమాంలు, మౌజన్‌లు, ముతవల్లి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలకు న్యాయం జరిగిందంటే అది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 4శాతం రిజర్వేషన్ కల్పించారని, తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగుతూ ఇమాంలకు వేతనాలు ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన రాకూడదంటే కూటమికి ఓటు వేయరాదని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు గని, ఇస్మాయిల్, ఉశేన్‌బాషా, మాలిక్ బాషా, మజీద్, షేక్షా, సుభాన్, మాజీ సర్పంచు విజయసింహారెడ్డి, జిల్లా నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, జాతీయ బీసీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణకొట్కూరులో ప్రచారం



బ్రాహ్మణకొట్కూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం సాయంత్రం విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్‌కు ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డికి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎన్. వెంకటరెడ్డి, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామానికి చెందిన చంద్రమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న గ్రామసర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి మృతురాలి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల నగదును పీఎం శేషారెడ్డి చేతుల మీదుగా ఆమె కుమార్తె మేరమ్మకు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు



శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీని వీడి పలువురు నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి భువనేశ్వర్‌రెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పట్టణంలోని టీడీపీ నాయకులు సయ్యద్ మీర్, మున్నా, మహబూబ్‌తో పాటు 20 మంది సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు సయ్యద్‌మీర్, నాయకులు రమణారెడ్డి, జెడ్ శ్రీనివాసరెడ్డి, రఫీ, జయకృష్ణ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులు సక్రమంగా నిర్వహించాలి

ఆత్మకూరు/మహానంది: పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ పంకజ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్వో కార్యాలయంలో బుధవారం సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన 145వ బూత్‌ను పరిశీలించారు.

టీడీపీవి అమలుకు సాధ్యంకాని హామీలు



రామాపురంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మహానంది: అధికారంలోకి రావడం కోసం అమలుకు సాధ్యం కాని హామీలతో చంద్రబాబు బూటకపు మేనిఫెస్టో ప్రకటించారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల మేలు, రాష్ట్రాభివృద్ధి కోసం సాధ్యమైన హామీలను మేనిఫెస్టోలో రూపొందించారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబుకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గుర్తించాలని కోరారు. బండిఆత్మకూరు మండలం రామాపురం, లింగాపురం, జీసీ పాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డితో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఓటమి భయంతోనే బుడ్డా బెదిరింపుల పర్వం

టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఓటమి భయంతోనే బెదిరింపులకు దిగుతున్నాడని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సోమయాజులపల్లెలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దుర్మార్గంగా మాట్లాడాడని, బెదిరింపులకు పాల్పడితే భయపడేవారు ఎవరూ లేరన్నారు. నా ఊరులోని ఎస్సీ కాలనీ అంతలేదు మీ ఊరు అంటూ అవమానించిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి రామాపురం ప్రజలు మే 13న గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

జగనన్న పాలనలో పేదరికం దూరం

సీఎం జగనన్న పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదరికం దూరమైందని, పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి అన్నారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు చంద్రబాబుకు గుర్తు రాని పేదల సంక్షేమం ఉన్నట్లుండి ఇప్పుడే గుర్తుకు రావడం, కూటమి పేరుతో కుట్రలకు దిగడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోకపోతే వృద్ధులు, వికలాంగులు, అన్ని వర్గాల వారు అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు దీపుకాంత్‌రెడ్డి, సర్పంచ్ పుల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, బండిఆత్మకూరు ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కృష్ణమల్లారెడ్డి, ఏపీ గొర్రెల పెంపకందారుల జిల్లా డైరెక్టర్ కాకనూరు సుబ్బయ్యయాదవ్, రామాపురం కోటేష్, బొజ్జా వెంకటేశ్వర్లు, మారాసు బాల సుంకన్న, బింగి సంటెప్ప, లింగాపురం సర్పంచ్ రాధమ్మ, నాయకులు భూమా వెంకటనాగిరెడ్డి, గోపిరెడ్డి వెంకటరెడ్డి, తిరుపంరెడ్డి, ఎంపీటీసీ అర్జున్, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, జీసీ పాలెం బలరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరామిరెడ్డి, కాకనూరు మహేశ్వరరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఒక్కొక్కరు 10 మందితో ఓటు వేయించాలి



బుడ్డా శేషారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

వెలుగోడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను వివరించి ఒక్కొక్కరు 10 మందితో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుడ్డా శేషారెడ్డి సమక్షంలో మాజీ ఎంపీటీసీ అబుఖాన్ కుటుంబ సభ్యులు, ఆటో, లారీ వర్కర్లు సుమారు 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శేషారెడ్డి మాట్లాడుతూ..58 నెలల కాలంలోనే సీఎం వైఎస్ జగన్ డీబీటీ ద్వారా రూ.270 లక్షల కోట్లు నేరుగా జమ చేశారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. అందరూ కలిసి కట్టుగా పని చేసి రెండు ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు శిల్పా చక్రపాణిరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిలను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఎం.ఫజివుల్లా ఖాన్, రబ్బాని, ముజిబ్ ఖాన్, అబ్దుల్ రవూఫ్, సద్దాం, జాకీర్‌హుసేన్, సయ్యద్ ఫయాజ్, ముర్తుజావలి, రఫీ, కరిముల్లా, మస్తాన్, ఖాసీం వలి, మొమిన్ సాహెబ్, మన్సూర్, మౌలాలి, షాకీర్, అష్రాఫ్ అలీ ఉన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ గుండ్రెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వంగాల వెంకట్రామిరెడ్డి, ముంతల విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ చికెన్ బాబు పాల్గొన్నారు.

బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బెదిరించడం దారుణం

మహానంది: ఎన్నికల ప్రచారంలో శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రజలు, ప్రజాప్రతినిధులపై అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరించడం అప్రజాస్వామ్యకమని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మహానందికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెలో మంగళవారం బుడ్డా బెదిరింపుల పర్వం, దుర్భాషలాడిన విషయాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా పరిగణనలోకి తీసుకొని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేవస్థానం ఉద్యోగుల ‘రాజకీయం’



శ్రీశైలంలో గత నెల 22న చంద్రబాబుతో ఫోటో దిగిన దేవస్థాన రెగ్యులర్ ఉద్యోగి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సూపరింటెండెంట్ స్థాయి అధికారి దేవదాయ శాఖ ఆదేశాలను, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను లెక్కచేయకుండా టీడీపీ అధినేత చంద్రబాబుతో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంతేకాకుండా ఏప్రిల్ 22న ఆయనకు ఆలయంలో ఎటువంటి విధులు లేనప్పటికీ టీడీపీ అధినేత చంద్రబాబు దర్శనం ముగించుకుని వచ్చి తిరిగి గెస్ట్‌హౌస్ వద్దకు చేరుకునేంత వరకూ ఆయనతో పాటే ఉన్నారు. అలాగే గెస్ట్‌హౌస్‌లో చంద్రబాబుతో కలిసి ఫొటో దిగారు. ఈ ఫోటో ఆలస్యంగా బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చంద్రబాబు ఆలయానికి వచ్చినప్పుడు సదరు సూపరింటెండెంట్ అధికారితో పాటు వసతి విభాగంలో పనిచేసే ఓ రెగ్యులర్ ఉద్యోగి కూడా చంద్రబాబు దర్శనం అయిపోయేంత వరకు ఆయనతో పాటు ఉంటూ స్వామిభక్తి ప్రదర్శించినట్లు అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకులతో దేవస్థాన రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో తిరగకూడదని, రాజకీయ పార్టీ నాయకులతో కలవడం, ఫొటో కూడా దిగకూడదని ఇటీవల దేవస్థాన ఈఓ అధికారికంగా ప్రకటన జారీ చేశారు. మరి చంద్రబాబుతో ఫొటో దిగిన సూపరింటెండెంట్ స్థాయి అధికారిని, వసతి విభాగంలో విధులు నిర్వహించే ఓ ఉద్యోగిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

ఈఓ చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు ?

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలదేవస్థానంలో పనిచేస్తూ తెలుగుదేశం పార్టీ ప్రచారకర్తలుగా, సానుభూతిపరులుగా పనిచేస్తున్న ఉద్యోగులపై ఈఓ పెద్దిరాజు శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ రెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు మొదలుకొని, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిబుడ్డా.రాజశేఖరరెడ్డి వెంట వీరు పార్టీ ప్రచారాలలో పాల్గొంటున్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఉద్యోగులపై ఈఓ పెద్దిరాజు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.